www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 2 ఫిబ్రవరి 2023 5 ఏలూరు



ఏలూరు కమిషనర్‌గా వెంకటకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ఏలూరు నగరపాలక సంస్థ నూతన కమిషనర్‌గా ఎస్.వెంకటకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి జిఓఆర్‌టి నెంబర్ 58 బుధవారం జారీ చేశారు. గతంలో ప్రకాశం జిల్లా ఒంగోలు కమిషనర్‌గా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై గుంటూరులోని మెప్మా రాష్ట్ర మిషన్ మేనేజర్‌గా నియమితులయ్యారు. కొద్దిరోజులుగా సచివాలయంలోని మెప్మా కమిషనర్ కార్యాలయంలో ఓఎస్‌డిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన షేక్ షాహిద్ సెలవులో ఉన్నారు. సోషల్ వెల్ఫేర్ డిడీగా ఉన్న ఆయన డిప్యుటేషన్‌పై ఏలూరు కార్పొరేషన్ కమిషనర్‌గా వచ్చారు. అయితే అనేక ఆరోపణలు నేపథ్యంలో సెలవులోకి వెళ్లారు. ఇటీవల తాడేపల్లిగూడెం కమిషనర్‌ను ఏలూరు కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించినట్లు వార్తలు వచ్చినప్పటికీ ఆయన విధుల్లో చేరలేదు. దీంతో ప్రభుత్వం వెంకటకృష్ణను నియమించింది.

బడ్జెట్‌లో మొండిచెయ్యి..!



- 'పోలవరం' ఊసే కరువు
- నిట్‌కు నిధుల కేటాయింపు నిల్
- రైల్వేలైన్లపై కొరవడిన స్పష్టత
- వ్యవసాయానికి దక్కని అండ
- మద్దతు ధరపై కనీస ప్రస్తావన నిల్
- వేతన జీవులకు ఆదాయ పన్నులో ఊరట

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర బడ్జెట్ జిల్లావాసులను తీవ్ర నిరాశపర్చింది. బుధవారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన 2023-24 వార్షిక బడ్జెట్‌లో జిల్లాలోని కేంద్ర ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుగాని, వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలిచే చర్యలుగాని కానరాలేదు. రాష్ట్రానికి జీవనాడి పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ఊసే లేకుండాపోయింది. పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనాల ఆమోదంపై సైతం బడ్జెట్‌లో ప్రస్తావన లేదు. నాబార్డు ద్వారా నిధుల కేటాయింపు జరిగినా బడ్జెట్‌లో పోలవరం గురించి ప్రస్తావించేవారు. అయితే ఈ సారి ఆ ఊసే లేకుండాపోయింది. దీంతో పోలవరం నిర్వాసితుల గురించి కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం కనికరం లేదని స్పష్టంగా తెలుస్తోంది. జిల్లాలో దాదాపు 126 గ్రామాలకు చెందిన 25 వేల నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉంది. ఇప్పటి వరకూ నిర్వాసితులకు ఇళ్ల నిర్మాణం, పునరావాస ప్యాకేజీ, యువతకు పరిహారం ఏఒక్కటీ ఇవ్వలేదు. కేంద్రం నిధులిస్తే తప్ప 45.75 కాంటూరు వరకూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వలేమని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. రూ.30 వేల కోట్లు పనులు, పునరావాసం కోసం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం అడుగుతుంది. అయితే ఈ బడ్జెట్‌లో పోలవరానికి సంబంధించి నిధుల ప్రస్తావన లేకపోవడం చూస్తే నిర్వాసితులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయనున్నట్లు అర్థమవుతోంది. జిల్లాలోని కేంద్ర విద్యాసంస్థ నిట్‌కు సైతం నిధుల కేటాయింపులు ఎక్కడా కన్పించలేదు. హైదరాబాద్ ఐఐటి, పెట్రోలియం యూనివర్సిటీ ఇలా కొన్ని సంస్థలకు నిధుల కేటాయింపుపై స్పష్టత ఇచ్చినప్పటికీ ఏపి నిట్‌కు సంబంధించి నిధుల కేటాయింపుపై మాత్రం బడ్జెట్‌లో పేర్కొనలేదు. రెండో ఫేజ్ పనులు సాగాలంటే ఈ ఏడాది దాదాపు రూ.230 కోట్లు వరకూ అవసరమని ఏపి నిట్ యాజమాన్యం కేంద్రానికి నివేదించింది. బడ్జెట్‌లో మాత్రం నిధుల ప్రస్తావన ఎక్కడా కన్పించలేదు.

వేతన జీవులకు ఊరట

ఆదాయపు పన్నుకు సంబంధించి వేతన జీవులకు ఊరట లభించింది. రూ.ఏడు లక్షల్లోపు ఆదాయం ఉన్నవారికి పన్ను మినహాయింపు కల్పించారు. రూ.ఏడు లక్షలకు మించి ఆదాయం దాటితే మాత్రం రూ.మూడు లక్షల వరకూ మాత్రమే పన్ను మినహాయింపు ఇచ్చింది. రూ.మూడు నుంచి రూ.ఆరు లక్షల వరకూ ఐదుశాతం పన్ను, రూ.ఆరు నుంచి రూ.తొమ్మిది లక్షల వరకూ పదిశాతం పన్ను, రూ.తొమ్మిది నుంచి రూ.12 లక్షల వరకూ 15 శాతం పన్ను, రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ 20 శాతం పన్ను, రూ.15 లక్షలపైన 30 శాతం పన్ను ఉండనుంది. ప్రస్తుత మార్పులతో జిల్లాలో పన్ను చెల్లింపుదారులైన సుమారు 90 వేల మందికి కొంత ఊరట లభించే అవకాశం ఉందని అంచనా.

రైల్వేలైన్లపై కొరవడిన స్పష్టత

జిల్లాలో కొవ్వూరు-భద్రాచలం, కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్లకు సంబంధించి నిధుల కేటాయింపుపై బడ్జెట్‌లో ఎక్కడా స్పష్టత లేదు. కొవ్వూరు-సత్తుపల్లి రైల్వేలైన్ మార్పు గురించి మాట్లాడని పరిస్థితి. రైల్వేకు రూ.రెండు లక్షల కోట్లకుపైగా కేటాయించినట్లు ప్రకటించడం మినహా వివరాలు మాత్రం తెలియని పరిస్థితి. దీంతో జిల్లాలోని రైల్వేలైన్లకు నిధుల కేటాయింపు జరిగాయా లేదా అనే దానిపై అయోమయం నెలకొంది. రైల్వే అధికారులు స్పష్టత ఇస్తే తప్ప నిధులు వేటికి కేటాయించారో తెలియని పరిస్థితి. దీంతో జిల్లావాసుల్లో తీవ్ర నిరాశ నెలకొంది.

వ్యవసాయానికి దక్కని అండ

జిల్లాలో 80 శాతం ప్రజానీకం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, పండిన పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోతుంది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బడ్జెట్‌లో వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నట్లు ఆర్థిక మంత్రి మాటలు చెప్పడం మినహా ఆచరణలో ఏమీ కన్పించలేదు. కనీస మద్దతు ధరకు సంబంధించి చట్టం చేయాలని రైతులు, రైతుసంఘాలు పెద్దఎత్తున పోరాటం చేస్తున్నాయి. ఎక్కడా మద్దతు ధరపై ప్రస్తావన లేకుండాపోయింది. రైతులు ధరలేక నష్టపోతే తీసుకునే చర్యల గురించి మాట్లాడలేదు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఏడాదికి రైతులకు కేంద్రం రూ.ఆరు వేలు ఇస్తోంది. వ్యవసాయ పెట్టుబడులు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో కిసాన్ సమ్మాన్ నిధి సొమ్ము పెంచాలని రైతులు కోరుతున్నారు. బడ్జెట్‌లో ఆ ఊసే లేదు. వ్యవసాయ రంగానికి, ఉపాధిహామీకి సైతం నిధులు కోతపెట్టారు. ఆక్వా రంగం అభివృద్ధికి సంబంధించి మత్స్యసంపద యోజన కింద రూ.ఆరు వేల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఆక్వా రైతులకు అది ఏమూలకూ సరిపోని పరిస్థితి.


ధరలు పెరిగే వస్తువులు

బంగారం, ప్లాటినంతో తయారు చేసే ఆభరణాలు, సిగరెట్లు, గిల్టు నగలు, వంటగదిలో ఉపయోగించే ఎలక్ట్రిక్ చిమ్నీలు, సైకిళ్లు, ఆట వస్తువులు

ధరలు తగ్గే వస్తువులు

హీట్ కాయిల్స్, మొబైల్ భాగాలు, ల్యాప్‌టాప్, కెమెరా లెన్స్‌లు, టీవీ ప్యానల్ భాగాలు, లిథియం, అయాన్ బ్యాటరీలు, ఎలక్ట్రిక్ వాహనాలు

నిరాశపర్చిన నిర్మలమ్మ బడ్జెట్



ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ జిల్లావాసులను తీవ్ర నిరాశపర్చింది. జిల్లాకు సంబంధించి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధుల కేటాయింపు, నిర్వాసితుల పరిహారం కోసం ప్రస్తావన లేదు. ఇక రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు గురించి ప్రస్తావనే లేదు. రైతులకు మద్దతుధర గ్యారెంటీ చట్టం తీసుకొస్తానన్న ఊసే లేదు. కొవ్వూరు-భద్రాచలం, కొవ్వూరు-సత్తుపల్లి రైల్వే లైన్ల సంగతి ఏమిటో పాలకులకే తెలియాలి. ధరల నియంత్రణకు ఏమైనా చర్యలు తీసుకుంటారో లేదో స్పష్టత లేదు.

ఉద్యోగ, కార్మిక, స్కీమ్ వర్కర్లకు నిరాశ



డిఎన్‌విడి.ప్రసాద్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

కేంద్ర బడ్జెట్ ఉద్యోగ, కార్మిక వర్గాలను, స్కీమ్ వర్కర్లను తీవ్రంగా నిరాశపర్చింది. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని అనేక ఏళ్లుగా పోరాడుతున్నప్పటికీ ప్రస్తావన లేకపోవడం శోచనీయం. అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం, సిపిఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లకు వేతనాల పెంపుదలపై చర్చే లేదు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులకు, స్కీమ్ వర్కర్లకు బడ్జెట్లో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దేలా చర్యలు చేపట్టాలి.

ఎగుమతులకు రాయితీలు అవసరం



కారుమూరి నరసింహారావు, అధ్యక్షులు, ఛాంబర్ ఆఫ్ కామర్స్, పాలకొల్లు

ఆర్థిక మాంద్యం నేపథ్యంలో ఎగుమతులకు రాయితీలు ఇవ్వాల్సి ఉంది. ఆర్థిక మాంద్యం ప్రభావం ఎక్కువగా ఉంది. బడ్జెట్లో ఎగుమతిదారులకు మంచి ప్రోత్సాహకాలు ఇచ్చి ఉంటే బాగుండేది. కరోనా సమయం కన్నా గతేడాదిగా ఆర్థిక మాంద్యంతో ఎగుమతిదారులు నష్టాలు చవిచూస్తున్నారు. జౌళి, నూలు పరిశ్రమదారులు తీవ్ర నష్టాల్లో ఉన్నారు.

ఉపాధి హామీకి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలి



పివి.రామకృష్ణ, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి

ఉపాధి హామీ పనులకు కేంద్ర బడ్జెట్లో రెండు లక్షల కోట్లు కేటాయించాలి. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఉపాధి హామీకి నిధులు రూ.89 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్లకు తగ్గించడం అన్యాయం. ఆహార భద్రతకు రూ.2.87 లక్షల కోట్ల నుంచి రూ.1.97 లక్షల కోట్లకు కుదించడం దారుణం. ఉపాధి హామీకి సంబంధించిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర రంగాలకు మళ్లించడం దుర్మార్గం. ఉపాధి కూలీలకు 15 రోజుల్లోపు వేతనాలు చెల్లించకపోవడం, పట్టణాల్లో పనులు రద్దు చేయడం, రెండు పూటల పని పేరుతో చట్టాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది. కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి పెరిగిన ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలి. పనుల దగ్గర నీడ, నీటి వసతి కల్పించాలి. పట్టణాల్లో ఉపాధి పనులు చూపి ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలి.

ఇది పెద్దల బడ్జెట్



దేగా ప్రభాకర్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టిన బడ్జెట్ పేదలది కాదు. పెద్దల బడ్జెట్. పేదలకు ధరలు అందుబాటులోకి వచ్చేలా సబ్సిడీలు కేటాయించాలి. గ్రామీణ ఉపాధి హామీ పనులకు నిధులు పెంచాలి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, రైల్వేలకు నిధుల కేటాయింపు తదితర అంశాల్లో స్పష్టత లేదు.

రైతులకు నిరాశజనకంగా బడ్జెట్



కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి

కేంద్రబడ్జెట్‌లో బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధుల కోత పెట్టి మొండి చెయ్యి చూపింది. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం హామీ గురించి ప్రస్తావన లేదు. రైతు రుణమాఫీ గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్లు రుణమాఫీ చేస్తున్న బిజెపి ప్రభుత్వం రైతుల రుణాలు ఎందుకు మాఫీ చేయడం లేదు. కార్పొరేట్ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం బాటలు వేస్తూ బడ్జెట్ కేటాయింపులు ఉన్నాయి. సహకార సొసైటీలను డిజిటలైజేషన్ చేస్తామని చెబుతూనే మరోవైపు సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తోంది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం స్థానంలో సమగ్ర పంటల బీమా పథకం అమలు చేయాలి. పోలవరానికి నిధుల గురించి ఏమీ చెప్పలేదు. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి 10 శాతం నిధులు కేటాయించాలి.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి

స్థలం కోసమే చంపేశాడు

గతనెలలో అదృశ్యమైన మహిళ హత్య

ప్రజాశక్తి - చింతలపూడి

.గత జనవరి 19వ తేదీన అదృశ్యమైన చింతలపూడి ఎస్‌బిఐ నగర్‌కు చెందిన పొట్ల నాగమణి(37) అతిదారుణంగా హత్యకు గురైంది. భూ వివాదం, వివాహేతర సంబంధమే మహిళ దారుణ హత్యకు కారణమని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు. ఇప్పటి వరకూ మిస్టరీగా ఉన్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి వెల్లడించారు. ఎస్‌బిఐ నగర్‌కు చెందిన నాగమణి భర్త రాబర్ట్ 2015లో మరణించారు. అప్పటినుంచి తన ఇద్దరు పిల్లలతో అత్తమామలతో కలిసి ఉంటుంది. వీరికి గంగారం గ్రామంలో ఆర్ఎస్ నెంబరు 131/1లో 20 కుంట్ల స్థలం (సుమారు 40 సెంట్ల) స్థలం ఉంది. ఈ భూమిని నాగమణి మావయ్య సైమన్ ఆ భూమికి ఎగువన స్థలం ఉన్న తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వైరా గ్రామానికి చెందిన నంబూరి శ్రీనివాసరావుకు విక్రయించాడు. దీంతో నాగమణి ఆ భూమిలో తనకు వాటా కావాలంటూ 2016లో కోర్టులో దావావేసింది. ఈ క్రమంలో ఓంసాయిశ్రీబాలజీ సెక్యూరిటీలో పనిచేస్తున్న బర్రె రాంబాబు నాగమణిని పరిచయం చేసుకుని స్థల వివాదం తనకు తెలిసిన పెద్దలతో మాట్లాడి పరిష్కరిస్తానని నమ్మించాడు. అంతేకాక ఆమెతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే గతనెల 19వ తేదీన రాంబాబు కారును కిరాయికి తీసుకుని స్థలం సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పి కాకినాడ సర్పవరం జంక్షన్‌లోని శ్రీనివాస లాడ్జికి వెళ్లారు. అక్కడ కూడా సెటిల్‌మెంట్ కాకపోవడంతో తిరిగి వస్తున్న క్రమంలో కారులోనే జాకీరాడ్‌తో తలపై కొట్టి, ఆ తరువాత చీరతో మెడకు గట్టిగా బిగించి, ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశాడు. అనంతరం ఆమె మెడలోని బంగారు లాకెట్, ఇతర బంగారం వస్తువులు అపహరించి, ఓ గోనె సంచిలో మృతదేహన్ని మూటకట్టి 21వ తేదీ తెల్లవారుజామున తెలంగాణ రాష్ట్రం దమ్మపేట మండలం ఆర్లపెంట గ్రామ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్‌వద్దకు తీసుకొచ్చి పెట్రోల్ పోసి తగులబెట్టాడు. అయితే రాంబాబుకు సుపారీ ఇచ్చి ఆమెను హత్య చేయమని ప్రోత్సహించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కోణంలో అతన్ని పోలీసులు విచారిస్తున్నారు. ఈ కేసులో మరో వ్యక్తి నంబూరి శ్రీనివాసరావును కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్‌పి తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్‌పి సత్యనారాయణ, సిఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ హరికృష్ణ పాల్గొన్నారు. ఈకేసును ఛేదించిన పోలీస్ సిబ్బందికి ఎస్‌పి రివార్డులు అందించారు.

నాగమణి కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో

నాగమణి కుటుంబానికి న్యాయం చేయాలంటూ నాగమణి బంధువులు చింతలపూడి ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఆందోళన చేపట్టారు. కుటుంబ సభ్యులు, దళిత సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం బోసుబొమ్మ సెంటర్ వరకూ ర్యాలీగా వెళ్లి అక్కడ రోడ్డుపై బైఠాయించారు. చింతలపూడి సిఐ మల్లేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

4, 5 తేదీల్లో హేలాపురి బాలోత్సవం

ఏలూరులో మూడో పిల్లల సంబరాలకు విస్తృత ఏర్పాట్లు

ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 4, 5 తేదీల్లో ఏలూరులో హేలాపురి బాలోత్సవం పేరిట మూడో పిల్లల సంబరాలను పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి, బాలోత్సవం ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు షేక్ సాబ్జీ చెప్పారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏలూరులోని సర్ సిఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఈ నెల నాలుగో తేదీ ఉదయం 9.30 గంటలకు హేలాపురి బాలోత్సవం మూడో పిల్లల సంబరాలు ప్రారంభమవుతాయన్నారు. బాలోత్సవం ఘనంగా నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. బాలోత్సవం జయప్రదానికి వివిధ కమిటీలు ఏర్పాటు చేసి కృషి చేస్తున్నామని వివరించారు. ఏలూరు నగరంలోని చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రముఖులు, పెద్దలు, వర్తక వాణిజ్యవర్గాలు, విద్యాసంస్థలు అందరూ సహకరించాలని కోరారు. రేపటి పౌరులను దేశభక్తులుగా, సామాజిక దృక్పథం కలిగినవారిగా, పర్యావరణ ప్రేమికులుగా, సేవాతత్పరులుగా మార్చేందుకు విజ్ఞానవంతమైన సమాజాన్ని నిరించేందుకు ఈ బాలోత్సవ కార్యక్రమాలు దోహదం చేస్తాయని చెప్పారు. బాలోత్సవ పిల్లల సంబరాల్లో ఏలూరు నగరంతోపాటు ఏలూరు, పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, ముసునూరు మండలాల్లోని 570 స్కూళ్లకు సంబంధించిన మూడో తరగతి నుండి పదో తరగతి వరకూ చదువుతున్న వేలాది మంది విద్యార్థులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. 60 రకాల కల్చరల్, అకడమిక్ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తారని వివరించారు. ఏలూరు నగరంలో పెద్దఎత్తున జరుగుతున్న బాలోత్సవం మూడో పిల్లల సంబరాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలోత్సవ ఆహ్వాన సంఘం అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎల్.వెంకటేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవంలో భాగంగా పాడుదమా స్వేచ్ఛా గీతం పాటను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ లో నమోదు చేసేందుకు వెయ్యి మంది విద్యార్థులతో ఆలపించేలా నాలుగో తేదీన కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. రెండు రోజులపాటు జరిగే ఈ బాలోత్సవం పిల్లల సంబరాల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్, జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. బాలోత్సవం విజయవంతం చేసేందుకు వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ విద్యార్థులను ప్రోత్సహించి వివిధ పోటీల్లో వారు పాల్గొనేటట్లు చేసి సహకరించి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. బాలోత్సవం పిల్లల సంబరాల పోస్టర్లను ఆహ్వాన సంఘం కమిటీ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం నాయకులు కె.శ్రీనివాస్, వై.ఆనందనాయుడు, ముస్తాఫ్‌ఆలీ, వి.సురేష్, ఎం.అజయ్‌బాబు, కె.సత్యనారాయణ, ఎబి.త్రిపురసుందరి, కట్టా సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించిన నేతలు

5న చలో ఢిల్లీ జయప్రదం చేయాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమణరావు

ప్రజాశక్తి - ఉంగుటూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడాలని సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు పిలుపునిచ్చారు. బుధవారం చేబ్రోలులో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మూడున్నరేళ్లుగా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఇచ్చిన జిఒను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిలుపుదల చేసిన సంక్షేమ బోర్డును పున:ప్రారంభించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికులకు నష్టం కలిగించే విధంగా కార్మిక చట్టాల సవరణ పేరుతో 44 చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మికులకు తీవ్ర నష్టం కలిగించాయన్నారు .ఈ చట్టాల మార్పును వెనక్కి తీసుకోవాలని కోరుతూ ఈ నెల ఐదో తేదీన ఢిల్లీలో ధర్నాలో కార్మికులందరూ పాల్గొవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీరా అప్పారావు, బి.సూరిబాబు, నీలం కాశీ, కె.సత్యనారాయణ, శేషపు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

3న సిపిఎస్ సదస్సును జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఉపాధ్యాయులు, ఉద్యోగులు కోరుకునేది సిపిఎస్ రద్దు మాత్రమేనని ఉభయ గోదావరి జిల్లాల ఎంఎల్‌సి షేక్ సాబ్జీ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ మంజూరు చేయాలని కోరుతూ యుటిఎఫ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు స్థానిక జెడ్‌పిహెచ్ బాలుర పాఠశాల నుంచి బుధవారం 2కే వాక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల మూడో తేదీన విజయవాడ సమీపంలోని గన్నవరంలో నిర్వహించే సిపిఎస్ సదస్సును జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవి.శ్యాంబాబు, జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ ఎంఎ.నబి, మండల అధ్యక్ష కార్యదర్శులు షేక్ తడాహికో, టి.రామకృష్ణ, కొయ్యలగూడెం అధ్యక్షులు బివి.రావు, గౌరవ అధ్యక్షులు ఎస్.రమేష్, జంగారెడ్డిగూడెం సిపిఎస్ డివిజన్ కన్వీనర్ షరీఫ్ పాల్గొన్నారు.

సిఎస్ఆర్ నిధులతో సామాజిక కార్యక్రమాలు : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సిఎస్ఆర్) ద్వారా విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ తదితర సామాజిక కార్యక్రమాల అమల్లో పరిశ్రమలు, ప్రభుత్వరంగ సంస్థలు భాగస్వాములు కావాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో సిఎస్ఆర్ నిధుల పర్యవేక్షణ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎస్ఆర్ కింద పరిశ్రమలు తమ సొంత ప్రణాళికల ప్రకారం నిధులు ఖర్చుచేస్తే ఆడిట్ సమస్య రావొచ్చని, అప్రధాన అంశాలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అంతేగాక ప్రభుత్వం లేదా ఇతర సంస్థలు అదే కార్యక్రమాన్ని చేపట్టి ఉంటే ఆపని డూప్లికేషన్ అయ్యే అవకాశం ఉందని, దీంతో తమ ప్రతిపాదనలను జిల్లా సిఎస్ఆర్ కమిటీ ముందు ఉంచితే అలాంటి సమస్యలు తలెత్తవని తెలిపారు. కమిటీ సమీక్షించి ఆ ప్రతిపాదనలు ఆమోదిస్తే దానికి సంబంధించిన ధృవపత్రాన్ని కంపెనీలకు జారీ చేస్తామని తెలిపారు. మన పరిశ్రమ బాగుండటంతో పాటు మన సమాజం కూడా బాగుండాలనే దృక్పథంతో ఉండాలని, ఫలితంగా సిఎస్ఆర్‌కి ఒక అర్థం పరమార్థమని చెప్పారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మన ఎదుగుదలకు ఇంత ఇచ్చిన సమాజానికి తిరిగి మనం ఏమి ఇస్తున్నామనే దృక్పథంతో ఆయా పరిశ్రమల యాజమాన్యాలు సమాజ అభివృద్ధిలో సిఎస్ఆర్ ద్వారా భాగస్వాములు కావాలన్నారు. సామాజిక అవసరాలకోసం రూ.ఐదు కోట్లు ఆపైన నికర లాభం కలిగిన కంపెనీలు మూడేళ్ల సగటు నికర లాభంలో కనీసం ఐదు శాతం నిధులను ఏటా సిఎస్ఆర్ కింద ఖచ్చితంగా ఖర్చుచేయాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్

సిఎస్ఆర్ నిధులతో వినూత్న ప్రజాప్రయోజిత కార్యక్రమాలు

సిఎస్ఆర్ నిధులతో జిల్లాలో విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ తదితర రంగాల్లో ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లాలో విజయవాడ సరిహద్దు నుంచి రాజమండ్రి వరకూ వంద కిలో మీటర్లు పైబడి జాతీయ రహదారి ఉందన్నారు. ఈ మార్గంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో తీవ్ర గాయాలకు గురైన వారికి అత్యవసర వైద్యం అందించేందుకు అవసరమైన ట్రామా కేర్ సెంటర్ లేదని ఈ దృష్ట్యా భీమడోలు సిహెచ్‌సిలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. గిరిజన ప్రాంతంలో సికిల్ సెల్ అనీమియా వ్యాధితో ఎంతోమంది బాధపడుతున్నారని ఈ దృష్ట్యా అక్కడి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు, రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారానికి అదనంగా మరింత సమకూర్చి వారిలో హిమోగ్లోబిన్ పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తున్నామన్నారు. దీనిద్వారా తల్లీ, బిడ్డను రక్షించగలిగిన వారమవుతామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల్లో లెర్నింగ్ స్కిల్స్ పెంచేందుకు ఆటపాటలకు ప్రత్యేక సౌకర్యాల కోసం ఈ నిధులను వెచ్చించనున్నట్లు చెప్పారు.

పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే దిశగా జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూమిని సమకూర్చడం, సింగిల్ డెస్క్ ద్వారా ఇతర అనుమతులను అందిస్తామన్నారు. ఈ విషయంలో తమను వ్యక్తిగతంగా సంప్రదించవచ్చన్నారు. ఈ సమావేశంలో జెసి పి.అరుణ్ బాబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం పి.ఏసుదాసు, జెడ్‌పి సిఇఒ కె..రవికుమార్, పంచాయతీ రాజ్ ఎస్ఇ చంద్రభాస్కర్‌రెడ్డి, కాలుష్యనియంత్రణ మండలి ఇఇ వెంకటేశ్వరరావు, చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ త్రినాథ్, డిఎంహెచ్ఒ డాక్టర్ నాగేశ్వరావు సిపిఒ నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ సుమధురవాణి, ఆయా శాఖల అధికారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ పరిశ్రమల యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్‌పి

జిల్లా కారాగారంలో ఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా కారాగారాన్ని జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ బుధవారం తనిఖీ చేశారు. ఎస్‌పి జైళ్ శాఖ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం ఎస్‌పి ఖైదీలతో మాట్లాడి జైలు జీవితంలో పరివర్తన చెంది నేరాలకు దూరంగా ఉండాలని తెలిపారు. సిసి కెమెరాల పనితీరును పరిశీలించి కమ్యూనికేషన్ సిస్టం ఏర్పాటు చేయాలని, జైలు రక్షణ గోడ ఎత్తును పెంచాలని సూచించారు. జైలులో ఉన్న ఖైదీలకు మోటివేషన్ క్లాసెస్ కండక్ట్ చేస్తూ వారిలో పరివర్తన తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

శనివారపుపేటలో న్యాయ విజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వర స్థానిక శనివారపుపేటలోని సచివాలయం వద్ద బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏదైనా నేరం మోపబడినప్పుడు ముందుగా సంబంధిత వ్యక్తులు, వారి కుటుంబ సభ్యులకైనా కేసు వివరాలను తెలియజేయాలన్నారు. అరెస్టుకు ముందుగా కూడా లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు.

బలివే తిరునాళ్ల ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - ముసునూరు



సమీక్షిస్తున్న ట్రైనీ కలెక్టర్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ

ఈ నెల 18వ తేదీన శ్రీరామలింగేశ్వరస్వామి కళ్యాణ మహోత్సవం (బలివే తిరునాళ్లు)లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్, ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ పెంచల కిషోర్ అన్నారు. బలివే గ్రామంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఆలయ ఇఒ టి.విశ్వేశ్వ రరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమీక్షలో వారు మాట్లాడారు. ఈ సమీక్షలో ఆలయాధికారులతో పాటు ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలి

ప్రజాశక్తి - నిడమర్రు

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 1214 రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ ఐదో తేదీన నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు పిలుపునిచ్చారు. మండలంలోని పెదనిండ్రకొలనులో బుధవారం సోదాబత్తుల వాసు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో రమణరావు మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అధికారంలోకొచ్చి మూడున్నరేళ్లవుతున్నా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయకుండా ఇచ్చిన 1214 మెమోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బిందు సేద్యం ప్రగతిపై సమీక్ష

ప్రజాశక్తి - ఏలూరు

బిందు సేద్యంలో నిర్దేశించిన లక్ష్యాలను మార్చిలోగా సాధించాలని మైక్రో ఇరిగేషన్ శాఖ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ సిబి.హరినాథరెడ్డి మైక్రో ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లా మైక్రో ఇరిగేషన్ శాఖాధికారులు, స్టేట్ కోఆర్డినేటర్లు, జిల్లా కోఆర్డినేటర్లతో బిందు సేద్యం ప్రగతిపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ అర్హులైన రైతులకు బిందు సేద్యం మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

పింఛన్ సకాలంలో అందించాలి

ప్రజాశక్తి - పెదవేగి

ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల పింఛన్లు సకాలంలో అందించాలని వాలంటీర్లను మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్‌మనోజ్ కోరారు. మండలంలో బుధవారం ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు ఎంపిడిఒ రాజ్‌మనోజ్ కవ్వగుంట, వంగూరు గ్రామాల్లో పర్యటించారు. వాలంటీర్లు పింఛన్‌లను లబ్ది దారులకు అందిస్తున్న తీరు ను పరిశీలించారు.

మానవ సేవే మాధవ సేవ

చింతలపూడి :మానవ సేవే మాధవ సేవ అని ఎస్‌సి సెల్ చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు పల్లి శ్రీను, ఐ టిడిపి నియోజకవర్గ కన్వీనర్ బోడా అవినాష్ అన్నారు. మండలంలోని పోతునూరు గ్రామంలో మంగళవారం బొప్పన రాధమ్మ ట్రస్టు ఆధ్వర్యంలో వికలాంగుడైన టిడిపి కార్యకర్త లావు నరసింహరావుకు మూడు చక్రాల సైకిల్‌ను బుధవారం అందించారు. టిడిపి కుటుంబ సభ్యులైన ఇద్దరు వికలాంగులు పసుపులేటి నాగినికి, వెలుగు నాగమణి రెండు చక్రాల వీల్ సైకిళ్లను అందించారు.

గొర్రెలకు పిపిఆర్ వ్యాక్సిన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

గొర్రెలకు చీడ పారుడు వ్యాధి రాకుండా జిల్లావ్యాప్తంగా పిపిఆర్ వాక్సిన్ ఉచితంగా వేస్తున్నామని, గొర్రెల పెంపకందారులందరూ సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ జిల్లా జెడి నెహ్రూబాబు కోరారు. ఉంగుటూరు మండలంలోని చేబ్రోలులో గొర్రెలకు వాక్సిన్ వేసే కార్యక్రమాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో 1.50 లక్షల గొర్రెలకు వాక్సిన్ వేసేందుకు సిద్ధం చేశామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన కృషి

ప్రజాశక్తి - గణపవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ముందుంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పచ్చమట్ల ధర్మరాజు అన్నారు. మండలంలోని చిలకంపాడులో బుధవారం నిర్వహించిన జనంలోకి జనసేన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామంలో మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో పవన్‌కల్యాణ్‌ని గెలిపించాలని కోరారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చింతలపూడి


ద్విచక్రవాహనాన్ని రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన చింతలపూడిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వెలమపేట గ్రామానికి చెందిన పి.గంగాధర్ బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం కొత్తబస్టాండ్ బయలుదేరారు. ఈ క్రమంలో సీతానగరం వైపు ఎళ్తున్న లారీ గంగాధర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

10 మందికి జరిమానా

భీమడోలు :మండల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు భీమడోలు ఎస్ఐ చావాసురేష్ తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి న్యూసెన్స్ చేస్తున్న మరో ఏడుగురిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వీరందరిని బుధవారం భీమడోలు కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిషిక్ ఆదిత్య విచారణ అనంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన వారికి ఒక్కొక్కరికి రూ.పది వేలు, మద్యం తాగి న్యూసెన్స్ సృష్టించిన వారికి ఒక్కొక్కరికి రూ.200 వంతున జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి..!

ప్రభుత్వ ఉద్యోగులకు, చనిపోయిన వారికీ చెల్లింపులు
డ్వామా పీడీ ఆగ్రహం
డిఆర్‌పిలపై చర్యలకు సిఫార్సు



డిఆర్‌పి నుంచి వివరాలు సేకరిస్తున్న డ్వామా పీడి రాంబాబు

ప్రజాశక్తి - పెదవేగి/దెందులూరు

గ్రామీణ ప్రాంతాల్లో పేద ప్రజలకు ఉపాధి కల్పనకు, వలసలను నివారించేందుకు ఉన్న ఊరిలోనే వంద రోజులు పని కల్పించేలా మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పనుల్లో అవినీతి, అక్రమాలు పరాకాష్టకు చేరాయి. అధికారమే అండగా అందినకాడికి దోచుకుంటున్నారు. పేదల పేరు చెప్పుకుని ఈ పథకంలో చేసే అవినీతి అంతా ఇంతాకాదు. ఆఖరుకి చనిపోయిన వారి పేరు మీద, ప్రభుత్వ ఉద్యోగులకు పేమెంట్లు చేశారంటే ఏ రీతిలో అవినీతి జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. బుధవారం పెదవేగి మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద కరువు పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక ఇందుకు నిదర్శనం. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రాంబాబు ఆడిట్ నివేదికలను డిఆర్‌పిలతో వివరాలను విచారించారు. ఆడిట్ నివేదికల ప్రకారం వాస్తవానికి, నివేదికలకు ఉన్న తేడాలు గమనించి పీడీ ఖంగుతిన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లను నమ్మి కోట్ల రూపాయల విలువైన పనులను అప్పగిస్తే ఎందుకు అవకతవకలు జరిగాయని నిలదీశారు. చక్రాయిగూడెంలో ఆశావర్కర్, లైన్‌మెన్, వాలంటీర్లు కూడా పనులు చేసినట్లు మస్తర్ వేసి ఏవిధంగా పేమెంట్లు చేశారని ప్రశ్నించారు. డబల్ జాబ్ కార్డులు ఈ గ్రామంలో ఎక్కువగా ఉన్నాయని, వాటిని తొలగించే బాధ్యత ఎంపిడిఒ, ఎపిఒలదేనని అన్నారు. డబల్ జాబ్ కార్డులు డిలేట్ చేయాలని ఎపిఒ హేమలతను ఆదేశించారు. మండలంలో ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వ ఉద్యోగులకు పేమెంట్లు ఇచ్చి విచారణలో తమకు తెలియక చేశామంటే, వారిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా ఎలా కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాళ్లగోకవరం, బాపిరాజుగూడెం, అంకన్నగూడెం, అమ్మపాలెంలో ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలపై రైతులు సైతం ఫిర్యాదులు చేయటంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. విజయరాయి గ్రామంలో దుక్కిపాటి ప్రసాద్ అనే వ్యక్తి చనిపోయినా కరువు పని చేసినట్లు మస్తర్ వేసి పేమెంట్ చేయటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అవకతవకలకు పాల్పడిన డిఆర్‌పిలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, జాబ్ కార్డు ఉన్నవారు, పలు గ్రామాల ప్రజలు పీడికి ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, ఎపిఒ, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ఉంగుటూరు సర్వసభ్య సమావేశంలో హౌసింగ్ ఎఇ సురేష్‌బాబు



ఉంగుటూరు సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఎఇ సురేష్‌బాబు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మార్చి 22వ తేదీ ఉగాది నాటికి ఉంగుటూరు మండలంలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు నూరుశాతం పూర్తి చేసేందకు కృషి చేస్తున్నామని ప్రజాప్రతినిధులు కూడా దృష్టి సారించాలని మండల హౌసింగ్ ఎఇ సురేష్‌బాబు అన్నారు. ఉంగుటూరు ఎంపిపి గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ మండలంలో 2600 మందికి ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరవ్వగా ఇప్పటివరకు 1900 ఇళ్ల గ్రౌండింగ్ అవ్వగా1200 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. మిగతా నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. నిర్మాణాలు అసలు ప్రారంభించని లబ్ధిదారులను చైతన్యం చేయడంలో గ్రామ సర్పంచులు శ్రద్ద చూపాలని కోరారు. తహశీల్దార్ రమణరావు మాట్లాడుతూ పలు గ్రామాల్లో ఇళ్ల స్థలాల కోసం రైతుల నుంచి భూసేకరణకు నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ ధరకు రెట్టింపుపైగా ప్రభుత్వం నుంచి పరిహారం ఇప్పిస్తామన్నారు. వ్యవసాయ శాఖ ఎఇఒ కంభంపాటి వాణి మాట్లాడుతూ ఈ సీజన్‌లో ఆర్‌బికెల ద్వారా రూ.99.50 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. రానున్న రోజుల్లో ఆర్‌బికెల ద్వారానే 80 శాతం వరకు ఎరువులు, పురుగుమందులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

మాజీ మంత్రి వట్టి వసంత్‌కమార్‌కు నివాళి

మండల పరిషత్ సమావేశం అనంతరం మాజీ మంత్రి, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ వట్టి వసంతకుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన సేవలను పలు వురు నాయకులు, అధికారులు గుర్తు చేసు కున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు సింగిరెడ్డి సూర్యనారాయణ, ఎంపిడిఒ ప్రేమాన్విత, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పాపారావు బాబ్జి పాల్గొన్నారు.

సమావేశానికి పలు శాఖల అధికారులు, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు గైర్హాజరయ్యారు. ఉదయం 10.45 గంటలకు కొంతమంది సభ్యులతోనే సమావేశం ప్రారంభమైంది. 11 గంటలు దాటాక కూడా సభ్యులందరూ హాజరు కాకపోవడంతో కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వాళ్లందరికి ఫోన్లు చేసి పిలవాల్సి వచ్చింది. ఎజెండా ఏమి లేకపోవడం, ప్రతి మూడు నెలలకు ఒకసారి జరపాల్సిన సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. మండలానికి చెందిన వివిధ కేటగిరిల కింద 11 మంది ఉద్యోగులకు రిపబ్లిక్ డే రోజున ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నవారిని సత్కరించారు.

జల జీవన పథకానికి రూ.25 కోట్లు



గణపవరం సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

గణపవరం :గణపవరం మండల ప్రజానీకానికి తాగునీరు అందించడానికి జల జీవన పథకంలో భాగంగా రూ.25 కోట్లతో పనులు చేపట్టినట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) తెలిపారు. రూ.25 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ సమావేశం నూతన మందిరాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం ఎంపిపి దండు వెంకటరామరాజు అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంఎల్ఎ మాట్లాడారు. జల జీవన పథకంలో మండలంలో ప్రతి గ్రామానికి తాగునీరు అందిస్తామని తెలిపారు. మండలంలో శివారు గ్రామంగా ఉన్న ఎస్.కొండేపాడు గ్రామానికి మంచినీటి సదుపాయం కోసం రూ.70 లక్షలు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో పూడికపోయిన మంచినీటి చెరువులు అభివృద్ధి చేసి నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి సహకరించాలన్నారు. అనంతరం మాజీమంత్రి వట్టి వసంతకుమార్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం మండలంలో ఉత్తమ అవార్డులు అందుకున్న గణపవరం ఎంపిడిఒ జి.జ్యోతిర్మయిని, వ్యవసాయాధికారి వై.ప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. ఎంపిపి మాట్లాడుతూ మండలంలో రూ.1.70 లక్షలతో అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, ఎంఇఒ పి.శేషు, తహశీల్దార్ కృష్ణస్వామి, జెడ్‌పిటిసి సభ్యులు దేవవరపు సోమలక్ష్మి, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు చనుమూరి లక్ష్మీభవాని, మండల పరిషత్ ఉపాధ్యక్షులు సలాది రత్నకుమారి పాల్గొన్నారు.

నిరాశపరచిన బడ్జెట్

ప్రజాశక్తి - ముదినేపల్లి

వేతన జీవులను బడ్జెట్ నిరాశపర్చిందని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ బడ్జెట్ వల్ల విద్యారంగానికి ఒరిదిందేమీ లేదన్నారు. ఈ నెల మూడో తేదీన కృష్ణా జిల్లా గన్నవరం సమీపంలోని సుందరయ్య విద్యానగర్‌లోని ధర్మస్థలి ప్రాంగణంలో నిర్వహించే సంకల్ప దీక్ష సభకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. ఆయనతో పాటు యుటిఎఫ్ మండల అధ్యక్షులు బాయాజి, ప్రధాన కార్యదర్శి ఇంకొల్లు దుర్గాప్రసాద్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎంవి.బేతాళరావు, జి.రమేష్, వి.సత్యనారాయణ ఉన్నారు.

'బిసిలకు అనేక సంక్షేమ పథకాలు'

ప్రజాశక్తి - కైకలూరు

బిసిలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత జగనన్నదేనని విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ తెలిపారు. స్థానిక శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు. సంఘ అధ్యక్షులు తుపాకుల సోమాచారి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో శ్రీకాంత్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం బిసిలకు అనేక రాయితీలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, విశ్వబ్రాహ్మణులకు కరెంటు బిల్లులలో రాయితీలు ఇస్తున్నారని చెప్పారు. కార్పొరేషన్ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తారని చెప్పారు. అధ్యక్షులు తుపాకుల సోమాచారికి విశ్వకర్మ సేవ రత్న బిరుదుని ప్రదానం చేశారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాలుర హైస్కూల్ ఆవరణలో విద్యార్థులకు బుధవారం ఉచిత వైద్య సేవలు అందించారు. విద్యార్థులను పరీక్షించి విటమిన్స్, చర్మవ్యాధులకు సంబంధించి, క్యాల్షియం లోపాలను గుర్తించి చికిత్స అందించారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాల విద్యార్థులకు తరచూ పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆరోగ్య పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

వరిలో ఎండాకు తెగులు నివారించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వరి రైతులు బ్యాక్టీరియా ఎండాకు తెగులుపై సూచనలు పాటించాలని ఏరువాక కేంద్రం ఏలూరు శాస్త్రవేత్త కె.ఫణికుమర్ తెలిపారు. మండలంలోని పంగిడిగూడెం, లక్కవరం, గురవాయిగూడెం వరి పండించే ప్రాంతాల్లో వ్యవసాయ అధికారి కోసరావు, శాస్త్రవేత్త ఫణికుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వరి రైతులతో మాట్లాడుతూ జిల్లాలో వరి నాట్లు వేసే దశ నుంచి పిలక తొడిగే దశ వరకు వరి నారు సరిగా పెరుగుదల లేకుండా ఎండిపోయిన లక్షణాలను బ్యాక్టీరియా ఎండాకు తీగలుగా గుర్తించినట్లు తెలిపారు. దీని నివారణకు కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు, ప్లాంటామైసిన్ ఒక గ్రాము, ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేటట్లు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వైసిపి మండల కన్వీనర్ శ్రీనురాజు తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు సంక్షేమ పథకాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.జగ్గవరం సొసైటీ చైర్ పర్సన్ వాసిరెడ్డి మధు పాల్గొన్నారు.

ఎఐటియుసిలో 70 మంది సభ్యుల చేరిక అవాస్తవం

అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - నూజివీడు

ఎఐటియుసి అనుబంధ సంఘంలో 70 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు చేరినట్లు పలు పత్రికల్లో బుధవారం ప్రచురితమైన వార్తలో వాస్తవం లేదని, ఒక వ్యక్తి చేరి, అందరూ చేరినట్లు ఇచ్చిన సమాచారాన్ని సిఐటియు అనుబంధ సంఘం నూజివీడు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కమిటీ నాయకులు ఖండించారు. ఈ మేరకు సిఐటియు కార్యాలయంలో సిఐటియు నాయకులు జి.రాజు, జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మితో కలిసి యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ఒక ప్రకటన విడుదల చేశారు. క్రిస్టియానమ్మ గతంలో తమ యూనియన్ నాయకురాలిగా ఉందని, మూడు నెలల క్రితం జరిగిన నూజివీడు ప్రాజెక్ట్ నూతన కమిటీలో తను ఆశించిన స్థానం దక్కనందుకు ఎఐటియుసి అనుబంధ సంఘంలో ఆమె ఒక్కరే చేరినట్లు తెలిపారు. మిగిలిన వారు తమ యూనియన్‌లోనే కొనసాగుతున్నట్లు నూజివీడు అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.ఆదిలక్ష్మి, పి.రాజకుమారి తెలిపారు. యూనియన్ పోరాటాల ద్వారానే ఎన్నో హక్కులను సాధించుకున్నట్లు చెప్పారు.

ఆటోడ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కుక్కునూరు

ఆటో డ్రైవర్లకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి యర్నం సాయికిరణ్ కోరారు. అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్లు యూని యన్ అధ్యక్ష, కార్యదర్శులుగా పోచారపు వెంకటేశ్వర్లు, సంపత్తి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక య్యారని తెలిపారు. ఆ యూనియన్ సమావేశం సత్యనారా యణ అధ్య క్షతన సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి కిరణ్ మాట్లాడుతూ కుక్కునూరులో ఆటో డ్రైవర్లకు పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేయాలని, వెల్ఫేరు బోర్డు ఏర్పాటు చేసి రక్షణ కల్పించాలని సాయికిరణ్ డిమాండ్ చేశారు. అనంతరం అల్లూరి సీతారామరాజు ఆటో డ్రైవర్లు యూని యన్ నూతన కమిటీ ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా యర్నం సాయి కిరణ్, అధ్యక్షులుగా పోచారపు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా సంపత్తి సత్యనారాయణ, కోశాధి కారిగా నిమ్మల శివ, ఉపాధ్యక్షులుగా వేల్పుల దుర్గయ్య, సహాయ కార్య దర్శిగా దార కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమా వేశంలో ఆటో డ్రైవర్లు శనగ రాము, దాసరి మనోజ్, వినోద్, రాయి అశోక్, వై.రాజు,ఎన్. పుల్లారావు, వెంకన్న, వీరబాబు పాల్గొన్నారు.

పిఎం జీవన్ జ్యోతి బీమాను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకం పేదలకు గొప్ప వరమని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. స్థానిక ఇండియన్ బ్యాంకులో జీవనజ్యోతి పథకం ద్వారా వచ్చిన రూ.రెండు లక్షల చెక్కును అయ్యావారి రుద్రవరం సర్పంచి శేషగిరి చేతుల మీదుగా లబ్ధిదారులైన గోపర్తి రమాదేవికి బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికీ భీమా ఉండాలన్న ఉద్దేశంతోనే కేంద్రం ఈ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ పథకంలో చేరి ఏడాదికి కేవలం రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల వరకు ఇన్సూరెన్స్ పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. పాలసీదారుడు ఏ కారణం చేతనైనా చనిపోతే రూ.2లక్షలు నేరుగా ఇంటికే చేరేటట్లు ఈ పథకాన్ని రూపొందించారన్నారు. 18 నుండి 50 సంవత్సరాలు ఉన్న ఖాతాదారులు ఈ పథకంలో చేరి లబ్ధి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, ఉప సర్పంచి ఇంటి నాగరాజు, ఆదర్శ రైతు శ్రీనివాసరావు, బ్యాంకు మిత్రలు కల్యాణి జాస్మిన్, జోస్ మేరీ ఝాన్సీ, యానిమేటర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ముగిసిన ఎన్ఆర్ఎంఎల్ శిక్షణా కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన లక్ష్యంగా పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ జీవనోపాధుల మిషన్ (ఎన్ఆర్ఎంఎల్) నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాల సేవలను వినియోగించుకోవాలని వైఎస్ఆర్ క్రాంతి పథం భీమడోలు సహాయ ప్రాజెక్టు మేనేజర్ సురేష్ కుమార్ కోరారు. స్థానిక మండల సమైక్య కార్యాలయం వేదికగా మండల పరిధిలోని 46 డ్వాక్రా గ్రామ సంఘాల పాలకవర్గాలకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు బుధవారంతో ముగిశాయి. రెండో రోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.అనిత కార్యక్రమంలో భాగంగా ప్రాధాన్యత అంశాల గుర్తింపునకు ప్రత్యేకించిన మార్పు అంశంపై అవగాహన తరగతులను నిర్వహించారు. ప్రాధాన్యత అంశాలుగా సెర్ప్ గుర్తించిన వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, తాగునీరు, ఉమ్మడి ఆస్తులపై అవగాహన కల్పించారు. పాడి పరిశ్రమ అభివృద్ధి, నిత్యవసర వస్తువుల ప్రాధాన్యత ఇతర అంశాలను వివరించారు. తొలి రోజు, ముగింపు రోజు కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న భీమడోలు ఏరియా ప్రాజెక్ట్ మేనేజర్ ఎన్ఆర్ఎల్ఎం కార్యక్రమాల అమలుకు జిల్లాస్థాయిలో భీమడోలుతో సహా ఎనిమిది ఇతర మండలాలు ఎంపికయ్యాయన్నారు. భీమడోలు నిర్వహించే కార్యక్రమాల ద్వారా మండల పరిధిలోని 1759 డ్వాక్రా సంఘాలకు ప్రయోజనం చేకూరుతుందని వివరించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని మాజీ ఎంపిపి కొత్త ప్రకాష్‌బాబు కోరారు. మండలంలోని బొర్రంపాలెంలో శ్మశాన వాటిక అభివృద్ధి పనులను బుధవారం ప్రకాష్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో సేకరించిన రూ.ఐదు లక్షల వ్యయంతో షెడ్ నిర్మాణం, స్మశాన వాటిక చుట్టూ కంచె ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.